# నీటి సరఫరాలో అంతరాయం



సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లయి స్కీమ్ ఫేస్-1లో కలబ్‌గూర్ నుంచి లింగంపల్లి వరకు పీఎస్సీ, ఎంఎస్ పైపులైన్‌కు జాయింట్ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతులతో పాటు జంక్షన్ పనులు సైతం చేపట్టనున్నారు. ఈ నెల 6న ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు ఈ పనులు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ 24 గంటల పాటు పలు చోట్ల తాగునీటి సరఫరాలో అంతరాయం, కొన్ని చోట్ల లో ప్రెషర్‌తో నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు. పటాన్‌చెరు ఇండస్ట్రీయల్ ఏరియా, హెచ్‌సీయూ, బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, బీహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, ఎస్‌బీఐ ట్రైనింగ్ సెంటర్, డోయెన్స్ కాలనీ, ఆర్సీ పురం, పటాన్‌చెరు తదితర ప్రాంతాల వినియోగదారులు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్


హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 4 జనవరి 2025 | HYDERABAD











సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మహాసభకు తరలివచ్చిన బీసీ ప్రజానీకం

# దద్దరిల్లిన ధర్నా చౌక్

**బీసీ మహాసభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన బలహీనవర్గాలు.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం పెద్ద ఎత్తున నినాదాలు**

చిక్కడపల్లి, జనవరి 3: ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద శుక్రవారం ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో బీసీ మహాసభ నిర్వహించారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ మహాసభకు వేలాదిగా బీసీలు తరలివచ్చారు. బీసీ నినాదాలతో ధర్నాచౌక్ దద్దరిల్లింది. ఎమ్మెల్సీ కవిత హాజరై సభ వద్ద ఏర్పాటు చేసిన సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభను ప్రారంభించారు. దాదాపు 70 కుల సంఘాలకు పైగా నాయకులు హాజరై మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

### బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

**ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తో పాటు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తీవ్రంగా మోసం చేసింది. బీసీల పక్షాన ఎమ్మెల్సీ కవిత నిలబడడంతో కాంగ్రెస్ సర్కారుకు భయం పట్టుకున్నది. అందుకే ఈ ధర్నాకు రోజంతా ఉత్కంఠ తర్వాతే రాత్రికి పోలీసులు అనుమతి ఇచ్చారు. బీసీల కులాలకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏ ఒక్కటి అమలు చేయలేదు.**

-ముఠా జయసింహా, బీసీ సంఘం నేత, బీఆర్ఎస్ యువ నాయకుడు

### ముదిరాజులను బీసీ-ఏ జాబితాలోకి మారుస్తామని మోసం

అన్ని రంగాల్లో వెనబడిపోయిన ముదిరాజులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ - ఏలోకి మారుస్తామని హామీ ఇచ్చి నేడు మోసం చేసింది. బీసీలకు స్థానిక ఎన్నికల్లో ఇస్తామన్నా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. లేని పక్షంలో మా సత్తా చూపుతాం.

-కోటల యాదగిరి ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు

### పదేండ్లు స్వర్ణయుగం..

**బీఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు బీసీలకు స్వర్ణయుగమే. కేసీఆర్ పాలనలో ప్రతి కులానికి న్యాయం జరిగింది. రేవంత్ రెడ్డి బీసీ కులాలంటే చిన్న చూపు..అందుకే బీసీలను పట్టించుకోవడం లేదు.**

-విజయ్‌కుమార్ సగర, సగర్ కుల సంఘం నేత

### స్వలాభం కోసం పాలన

**వడ్డెరుల సంక్షేమం కోసం వడ్డెర కార్పొరేషన్ ఇస్తామని హామీ నేటి అమలు చేయలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలను ఓట్లు అడిగే హక్కు లేదు. సీఎం రేవంత్ రెడ్డి స్వలాభం కోసం పాలన కొనసాగిస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి.**

-ఆలకుంట్ల హరి, వడ్డెర కుల సంఘం నేత




బీసీ మహాసభలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత



వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లో నిర్మిస్తున్న కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

# మెట్రో రైల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 3: మెట్రో రైల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మెట్రో రైలు విస్తరణకు కృషి చేసిన ఎమ్మెల్యేను మౌలాలికి చెందిన నేతలు సన్మానించారు. వెంకటాపురం డివిజన్ భూదేవినగర్‌లో కల్వర్ట్ నిర్మాణపనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో రైలు వల్ల ఉత్తర తెలంగాణ నుంచి వచ్చే వారితో పాటు నగరవాసులకు ఉపయోగంగా ఉంటుందన్నారు ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్లు, జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట వరకు 22కిలో మీటర్లు రెండు వైపుల 45 కిలోమీటర్ల మెట్రో రైలును విస్తరించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం మెట్రో రైలు ఆమోదం తెలుపడంతో పాటు ఫేస్-2 పార్ట్-బీ ప్రథమ ప్రాధాన్యత క్రమంలో మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబితాకిశోర్, అనిల్ కిశోర్, ప్రభాకర్, జమేదార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లుడిపై పిటిషన్

### విచారణ అర్హతపై వివరణ ఇవ్వండి

### పిటిషనర్‌ను ఆదేశించిన హైకోర్టు



హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : విదేశాల్లో ఉన్న అల్లుడిపై కేసు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలంటూ హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌కు చెందిన 84 ఏళ్ల వృద్ధుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అమెరికా కాలిఫోర్నియాలో ఉన్న తన కుమార్తెను అల్లుడు చిత్రహింసలకు గురి చేస్తున్నారని, అల్లుడిపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ కుమార్తె భారత పౌరురాలిగా ఇక్కడి పోలీసుల నుంచి రక్షణ పొందే హక్కు ఉందని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ పిటిషన్ విచారణార్హత ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఏవైనా అభ్యంతరాలంటే అమెరికాలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. ప్రభుత్వ న్యాయవాది కూడా పిటిషన్ విచారణార్హం కాదనగా న్యాయమూర్తి విచారణను 8కి వాయిదా వేస్తూ విచారణార్హతపై వివరణ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాదికి ఆదేశాలు జారీ చేశారు.

# కాన్సెప్ట్ వన్ డెవలపర్స్..అరాచకం

### ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు మహిళ పై దాడి



బంజారాహిల్స్: ఫ్లాట్ పేరుతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగేందుకు ఆఫీసుకు వచ్చిన మహిళ పట్ల రియల్ ఎస్టేట్ సంస్థ డైరెక్టర్‌తో పాటు మరో వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు దాడికి పాల్పడ్డారు. ఫిలింనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ ఓయూ కాలనీలో నివాసముంటున్న మహిళ(36) ఓ ప్రైవేటు స్కూల్ ప్రిన్స్‌పాల్‌గా పనిచేస్తున్నారు. ఆరునెలల కిందట ఇన్‌స్టాగ్రామ్ ద్వారా టోలీచౌకి ప్రధాన రహదారిపై ఉన్న కాన్సెప్ట్ వన్ డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ గురించి తెలుసుకుని..నెక్నాంపూర్‌లో ఆ సంస్థ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ బుక్ చేసుకున్నారు. గత ఏడాది అగస్ట్‌లో అడ్వాన్స్‌గా రూ.8లక్షలు చెల్లించారు. కాగా.. డిసెంబర్‌లో నెక్నాంపూర్‌లోని తమ ప్రాజెక్టును నిలిపివేశామని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. మొదట రూ.3లక్షలు మాత్రమే ఇచ్చి.. ఆ తర్వాత ఫోన్లు ఎత్తడంలేదు. దీంతో గురువారం సాయంత్రం టోలీచౌకిలోని కాన్సెప్ట్ ఓన్ డెవలపర్స్ సంస్థ కార్యాలయానికి భర్తతో కలిసి బాధిత మహిళ వెళ్లి డబ్బులు అడిగారు. అక్కడి ఉద్యోగి అమేశ్ జాబ్రి అసభ్యంగా మాట్లాడాడు. అలాగే సంస్థ డైరెక్టర్ అబ్దుల్ రబ్ బిన్ అబ్దుల్లా కూడా అలాగే మాట్లాడి బాధిత మహిళ చెంపపై కొట్టాడు. దీంతో ఆమె భర్త అడ్డుకోవడానికి ప్రయత్నించగా అతడిపై సైతం దాడి చేశారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం ఉదయం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంస్థ డైరెక్టర్ అబ్దుల్ రబ్ బిన్ అబ్దుల్లా, అమేశ్ జాబ్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సిటీలోకి చైనా మాంజాలు

### అమ్మకానికి సిద్ధమైన కొందరు వ్యాపారులు..?

- నిఘాను పటిష్టం చేస్తున్న పోలీసులు
- టాస్క్‌ఫోర్స్ స్పెషల్ డ్రైవ్..14 కేసులు నమోదు
- చైనా మాంజాల అమ్మకాలపై సమాచారమివ్వండి
- నగరవాసులకు పోలీసుల విజ్ఞప్తి




సిటీబ్యూరో/చార్మినార్: చైనా మాంజాలు మనిషులతో పాటు జంతువులు, పక్షుల ప్రాణాలు తీస్తున్నాయి. గతేడాది చైనా మాంజా తగిలి ఆర్మీ జవాన్ మృతి చెందిన విషాదకర ఘటనతో ఈ సారి ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వాటి విక్రయాలను పూర్తిస్థాయిలో అడ్డుకోవాల్సి ఉంది. అయితే నగరంలో ఇప్పుడిప్పుడే పోలీసులు ఈ విషయంపై దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఓల్డ్‌సిటీలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 14 కేసులు నమోదు చేశారు. అయితే ఇప్పటికే కొందరు వ్యాపారులు చైనా మాంజాల విక్రయాలు ప్రారంభించడంతో ప్రజలు కొనుగోలు చేశారు. నగరంలోకి ఈ మాంజాలు రాకుండా ముందుగానే పూర్తిస్థాయిలో నిఘా పెట్టాల్సింది. గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఈ చైనా మాంజాలు హైదరాబాద్‌కు సరఫరా అవుతుంటాయి. సంక్రాంతి సీజన్ వస్తుందంటే పోలీసుల ముందుచూపుతో నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంటుంది. పోలీసులు జనవరి నెల ప్రారంభమయ్యిందంటే తమపై దృష్టి సారిస్తారని కొందరు వ్యాపారులు డిసెంబర్ నెలలోనే ఆయా ప్రాంతాల నుంచి చైనా మాంజాలను తెచ్చి అమ్మకానికి సిద్ధం చేసుకున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇలాంటి ఓ మోస్తరు వ్యాపారుల నుంచి బస్తీలు, కాలనీల్లో ఉండే చిరు వ్యాపారుల వద్దకు కూడా చైనా మాంజాలు విక్రయానికి వెళ్లాయి. కొందరు యువకులు, పిల్లలు సైతం ఈ మంజాలను కొనుగోలు చేశారు. ఈ సారి పూర్తిస్థాయిలో చైనా మాంజాలు నగరంలో విక్రయాలు జరగకుండా అడ్డుకుంటారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### చైనా మాంజాలతో విషాదాలు..

చైనా మాంజాలు వాడుతుండడంతో అవి మనిషుల ప్రాణాలు తీసేస్తున్నాయి. గత నాలుగైదేండ్లుగా చైనా మాంజాల నుంచి ప్రమాదాలు చోటు చేసుకుంటూ వస్తున్నాయి. గత ఏడాది ఆర్మీ జవాన్ కోటేశ్వర్‌రెడ్డి లంగర్ హౌస్ ఫ్లైవోర్‌పై ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, అకస్మాతుగా గొంతుకు చైనా మాంజా తగిలి ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ఘటనలు ప్రతి ఏటా ఎక్కడో ఒక చోట జరుగుతూ వస్తుండడంతో ట్రై పోలీస్ కమిషనరేట్లలో ఈ సారి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. చైనా మాంజాలను విక్రయించడంపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు. అయితే హోల్‌సెల్‌గా ఇతర రాష్ట్రాల నుంచి ఈ మాంజాలను తేవడాన్నే అడ్డుకట్ట వేస్తే సమస్యను పూర్తిగా అణిచివేసేందుకు అవకాశముంటుండేదని నగర వాసులు భావిస్తున్నారు. గత ఏడాది ఆర్మీ జవాన్ మృతి ఘటనతో పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించి, 40 మందికిపై ఇలాంటి వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. గత ఏడాది, అంతకు ముందు ఏడాది పట్టుబడ్డ వాళ్లు, కొత్తగా ఈ వ్యాపారంలోకి వచ్చిన వారెవరు అనే విషయాన్ని ముందుగానే గుర్తించి కట్టడి చేస్తే నగరానికి చైనా మాంజాలు వచ్చేందుకు అవకాశాలు తక్కువగా ఉండేవి.

### 14 కేసులు నమోదు

పర్యావరణంతోపాటు పక్షులకు, ప్రజలకు ప్రమాదకరంగా మారిన చైనా మాంజా అమ్మకాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం స్థానిక పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపారు. అసీఫ్‌నగర్, సైదాబాద్, బహుదురుపుర, మాదన్నపేట, కాచిగూడ, మీర్‌చౌక్, మొఘల్‌పురా, చిలకలగడూ, ఉస్మానియా యూనివర్సిటీ, శాహినాత్‌గంజ్, నారాయణగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మాంజా విక్రయాలు చేస్తున్న 14 మందిపై కేసులు నమోదు చేసి, అమ్మకాలకు 987 చైనా మాంజా బండిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు సైతం స్వీయ నియంత్రణ పాటిస్తూ పక్షులకు, పర్యావరణానికి, ప్రజలకు ప్రమాదకరంగా మారిన ఈ చైనా మాంజాలను కొనుగోలు చేయవద్దని, ఎవరైనా విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

# హైడ్రాలో 970 ఔట్ సోర్సింగ్ పోస్టులు

### పుట్‌పాత్‌లతో పాటు పలు ఆక్రమణలను తొలగించడమే లక్ష్యం

### తాత్కాలిక ఉద్యోగుల జీతాల ఖర్చు రూ.31.70కోట్లుగా అంచనా




సిటీబ్యూరో: హైడ్రాలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి అడుగులు వేస్తోంది. అతి త్వరలో 970 కాంట్రాక్ట్ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు. కొత్తగా వచ్చే అధికారులకు ఎలాంటి బాధ్యతలు ఇవ్వాలో కూడా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ ఏజెన్సీ ఒక సంవత్సరం పాటు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 203 మంది మేనేజర్లు, 767 మంది అసిస్టెంట్లను నియమించనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల హైడ్రా పరిధిలో ఉన్న నీటి వనరులు, పార్కులు, ప్రభుత్వభూములు, నాలాలను రక్షించడంలో హైడ్రాకు సహాయం చేయడం, అనధికార నిర్మాణాలు, ఆక్రమణలను గుర్తించడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. హైదరాబాద్‌లోని పుట్‌పాత్‌లతో పాటు జలవనరులు, ప్రభుత్వస్థలాల్లో వెలసిన ఆక్రమణలను తొలగించడంలో వీరిదే కీలకపాత్ర అని అధికారులు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులను ఏడు ప్యాకేజీలుగా విభజిస్తారు. మేనేజర్లకు రెండు, అసిస్టెంట్లకు ఐదు ప్యాకేజీలు ఉంటాయి. వీరి జీతాల కోసం మొత్తం ఖర్చు సంవత్సరానికి రూ.31.70 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.



తెలంగాణ భవన్‌లో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు